సార్లూ.. మంచినీటి కష్టాలు తీర్చండి

శుద్ధజల కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

గన్నేరువరం, ఫిబ్రవరి 6: మండలంలోని మైలారం గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్య తీర్చాలని కోరుతూ గ్రామస్తులు శుద్ధ జల ప్లాంట్ వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో రెండు శుద్ధ జల ప్లాంట్లు ఉన్నప్పటికీ ఏ ఒక్కటీ పనిచేయడం లేదన్నారు. ఎస్సీ కాలనీ, పక్కనే ఉన్న సాంబయ్య పల్లె గ్రామస్తులు కూడా ఈ వాటర్ ప్లాంట్ల నుంచే మంచినీటిని తీసుకొని వెళ్తుంటారని, ఆయా ప్లాంట్లు పనిచేయకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బంది ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తున్నదని, అధికారులు తక్షణం స్పందించి శుద్ధ జల ప్లాంట్లను మరమ్మతు చేయించి నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

నవోదయ పరీక్షపై డీఈవో సమీక్ష

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 6: జవహర్ నవోదయ విద్యాలయం చొప్పదండి పాఠశాలకు సంబంధించి 9, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం ఈనెల 8న జరుగనున్న అర్హత పరీక్షపై గురువారం డీఈవో జనార్దన్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, పరీక్ష కేంద్రాల పర్యవేక్షకులతో ఆయన మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఒక రోజు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని చూసుకోవాలని, విద్యార్థులందరూ ఉదయం 10 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, ఎలాంటి అలసత్వం ప్రదర్శించొద్దని, చిన్న పొరపాటు కూడా లేకుండా పరీక్షను విజయవంతం చేయాలని చెప్పారు. ఏసీజీఈ కే సంధ్యారాణి, నవోదయ ప్రిన్సిపాల్ మంగతాయారు, పరీక్ష నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Huzurabad Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to title Marka Madhu, S/o: Kistaiah, Age: 45 years, Occ: Seed Business, R/o: H.No. 2-120/2, Metpally village Shankarapatnam mandal of Karimnagar dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages, Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

In the Metpally revenue village, a Existing RCC slab house bearing number 2-119, total place to an extent of 276.15 Square yards its equivalent to an extent of 230.86 Square meters, in which a constructed RCC slab house was to an extent of 627.75 Square feet's and open place to an extent of 206.40 Square yards, within the boundaries on:
North: House of Marka Ramesh and Open place of Marka Ramesh
South: House of Marka Kistaiah vide H.No. 2-120
East: Land of J. Kumar
West: Road leads to Lingapur to Amudhalapally village
is situated at Metpally village Shankarapatnam mandal of Karimnagar dist
Date: 06-02-2025
Sd/- G. LAXMANA MURTHY, Advocate
Huzurabad. Cell No. 94403 69866

నమస్తే తెలంగాణ CLASSIFIED

పాస్‌పోర్టు పోయింది
★ అజ్మీర అమృతలాల్ S/o. కిషన్, H.No. 4-78, బుగ్గ రాజేశ్వర తండా, అక్కాపల్లి, మం॥ ఎల్లారెడ్డిపేట్, రాజన్న సిరిసిల్ల జిల్లా. నా పాస్‌పోర్టు అక్కపల్లి నుండి ఎల్లారెడ్డిపేటకు వస్తుండగా పోయింది. దొరికిన వారు సంప్ర॥ 86399 69258.
NTK-0000

CHANGE OF NAME
★ I, AYESHA MOHAMMADI (Old name) W/o. Syed Khalid Mohiuddin, D/o. Mohammad Jaleel Pasha, H.No. 6-2-716, Hussainipura, Karimnagar dist. my name was changed to SYEDA AYESHA MOHAMMADI (NEW NAME)
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

వాగేశ్వరిలో ఫ్రెషర్స్ హంగామా

తిమ్మాపూర్, ఫిబ్రవరి 6: మండలంలోని రామకృష్ణ కాలనీలో గల వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు సీనియర్లు ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఫార్మా రంగంలో నూతన ఒరవడులను అందిపుచ్చుకొని, తక్కువ ఖర్చుతో ఔషధాలను తయారుచేసి దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు ప్రకాశ్ రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వీణవంక, ఫిబ్రవరి 6: మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన జేసీబీ ఆపరేటర్ అజయ్ ఇటీవల మృతిచెందగా, గురువారం అతడి కుటుంబాన్ని జేసీబీ ఆపరేటర్స్ యూనియన్ సభ్యులు పరామర్శించారు. రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జేసీబీ ఆపరేటర్ యూనియన్ సభ్యులు బేతి కర్ణాకర్, నరేశ్, గొల్లపల్లి మహేశ్, కేకేసీ నాయకుడు మేక వెంకన్న పాల్గొన్నారు.

మాల మహానాడు నూతన కమిటీ

తిమ్మాపూర్ రూరల్, ఫిబ్రవరి 6: గొల్లపల్లి గ్రామ మాల మహానాడు నూతన కమిటీని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, మండలాధ్యక్షుడు ఎలుక రాజు ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్ర శంకర్, ప్రధాన కార్యదర్శిగా దేవరాజు, ఉపాధ్యక్షుడిగా తుంగ రాజు, కోశాధికారిగా చెవుల మల్లేశ్, గౌరవాధ్యక్షుడిగా కర్ర కొమురయ్య, ముఖ్య సలహాదారులుగా కర్ర శ్రీనివాస్, ఎర్రోళ్ల రాజయ్య, కర్ర శ్రావణ్, చెవుల రాహుల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గొల్లపల్లి మాల మహానాడు సభ్యులు రమేశ్, సుధాకర్, భాస్కర్, ఆశయ్య, పోచయ్య పాల్గొన్నారు.

పారమిత పాఠశాల సందర్శన

కొత్తపల్లి, ఫిబ్రవరి 6: పారమిత పాఠశాలలోని ఎన్‌సీసీ విభాగాన్ని 9వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రాకేశ్వర్ జస్వాల్, సుబేదార్ మేజర్ సాగర్‌సింగ్ సందర్శించారు. పాఠశాలలో మూడు సంవత్సరాలుగా ఎన్‌సీసీ కార్యక్రమాలను నిర్వహిస్తున్న విధానాలను పరిశీలించి, ప్రశంసించినట్లు హెచ్‌ఎం బాలాజీ పేర్కొన్నారు. పాఠశాలను సందర్శించి, సలహాలు సూచనలు ఇచ్చిన లెఫ్టినెంట్ కల్నల్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హనుమంతరావు, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్‌కు సన్మానం

కార్పొరేషన్, ఫిబ్రవరి 6: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్‌ను గురువారం అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్పొరేటర్‌గా వార్డు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. రానున్న రోజుల్లో రాజకీయాల్లో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

'జీసీఈసీ' క్లబ్ సమావేశం

మానకొండూర్, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలురు)లో గురువారం జీసీఈసీ (గర్ల్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్) సమావేశం నిర్వహించారు. జీవన నైపుణ్యాలు, ఆర్థిక సాధికారత, షీటీమ్స్ పనితీరు, కౌమారదశలోని సమస్యలపై ఈ సమావేశంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, కార్యక్రమ కన్వీనర్ నళిని, వైద్యాధికారులు, మహిళ పోలీస్‌సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సైదాపూర్, ఫిబ్రవరి 6: వెన్నంపల్లి స్వయంభూ మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో గురువారం బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయ చైర్మన్ సారబుడ్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ, 7 నుంచి 13వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బిల్ల రాజిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాబోయ్ కోతులు

- భయాందోళనలతో బెంబేలెత్తుతున్న గ్రామీణులు
- నియంత్రణ చర్యలు చేపట్టాలని వేడుకోలు

ప్రధాన సమస్యగా కోతుల బెడద

శంకరపట్నం, ఫిబ్రవరి 6: ఎక్కడో జనావాసాలకు దూరంగా అడవుల్లో ఉండాల్సిన కోతులు జనావాసాల్లోకి వచ్చి ఇండ్లల్లోకి చొరబడుతున్నాయి. ప్రజలపై దాడి చేస్తూ, ఆహార పదార్థాలు లాక్కెళ్తూ నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులపై నేరుగా దాడులు చేస్తుండగా గాయాలపాలైన వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నది. ఇండ్లల్లోకి చేరి వంట సామగ్రి, దుస్తులు, ఆహార పదార్థాలను చిందర వందర చేస్తున్నాయి. కోతుల బెడద కారణంగా ఇంటి పెరళ్లు, ఖాళీ జాగల్లో జనం కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచడం సైతం మానేశారు. ఇక దుకాణాదారులు తమ దుకాణాల షెట్టర్ల ముందు జాళీలను అమర్చుకుంటున్నారు. పెంకుటిళ్లు, రేకుల షెడ్లపై చేరి నానా హంగామా సృష్టిస్తున్నాయి. జనం రోడ్లపై నడవాలన్నా, రైతులు, కూలీలు రోజూవారీ పనుల్లోకి భయం భయంగా వెళ్తున్నారు.

ఇటీవల పీహెచ్‌సీలో కుక్క కాటు కంటే కోతులు కరిచిన కేసులు విపరీతంగా పెరిగిపోయాయి. కుక్కలను మించి కోతుల బెడదతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 40 ఏండ్ల క్రితం కేవలం మండలంలోని మక్త, మొలంగూర్ గుట్టలకు మాత్రమే పరిమితమైన కోతులు, నేడు అన్ని గ్రామాలకు చేరి సమస్యగా మారాయి. సగటున రోజుకు ఇద్దరు కుక్క కాటు బాధితులు, ఆరుగురు కోతి కాటుకు గురైన వారు పీహెచ్‌సీకి చికిత్సకు వస్తున్నారు. ఇటీవల వారం రోజుల్లో కేశవపట్నంలో ఇండ్లల్లో మంచాలపై పడుకుని ఉన్న ముగ్గురు వృద్ధులపై దాడి చేసి గాయరచగా, వారు గాయాలతో పీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొందారు. కోతుల బెడద నుంచి తమను కాపాడాలని, ఇకనైనా అధికారులు చిత్తశుద్ధితో నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్త కంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

కేశవపట్నం గ్రామ పంచాయతీ ఆవరణలో కోతుల గుంపు

గ్రామాల్లో రోజు రోజుకూ కోతుల బెడద తీవ్రమవుతున్నది. ఒక్కసారిగా వానర మూకలు ఇండ్లు, దుకాణాల్లో చొరబడి బీభత్సం సృష్టిస్తూ, దాడికి సైతం దిగుతుండడంతో పల్లెవాసులు భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ గడుపాల్సిన పరిస్థితి నెలకొన్నది. సగటున రోజు ఆరుగురు కోతి కాటుతో పీహెచ్‌సీకి చికిత్సకు వస్తుండడం సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నది.

రోజుకు ఆరుగురు బాధితులు

నిత్యం ఇద్దరు కుక్క కాటు బారిన పడి పీహెచ్‌సీకి చికిత్సకు వస్తుండగా, ఆరుగురు కోతుల దాడిలో గాయపడి వస్తున్నారు.. ఇటీవల ఒక్క మొలంగూర్ విలేజ్ నుంచే రోజూ ఒకరు కుక్క కాటు బాధితులు వస్తుండగా, ముగ్గురు కోతి కరిచిన కేసులు వస్తున్నాయి. పీహెచ్‌సీలో కావాల్సిన యాంటీ రేబిస్ వాక్సిన్స్ అందుబాటులో ఉన్నాయి. అందరికీ అవసరమైన చికిత్స అందిస్తున్నాం.

-పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్

పిల్లలందరికీ నులిపురుగుల మాత్రలు వేయించాలి

- హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు

జమ్మికుంట, ఫిబ్రవరి 6: 1–19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాజేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్‌వో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు కలుషిత ఆహార పదార్థాలు తినిపించకూడదని తెలిపారు. పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో కలిగే పరిణామాలను వివరించారు. గతంలో మాత్రలు వేయించని పిల్లలకు ఈ నెల 17 నులిపురుగుల మాత్రలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో హేమలత, డాక్టర్లు రాజేశ్, చందన, హెచ్‌ఈలు ప్రతాప్, మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు రత్నకుమారి, అరుణ, కుసుమ కుమారి, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కాలేజీలు, కళాశాలలకు చెందిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్, పట్టణ, మండల అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 6: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 10న హుజూరాబాద్ మండలంలోని పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని చెల్పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మధుకర్ అన్నారు. గురువారం హుజూరాబాద్‌లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. అన్ని పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని, వాటిని విద్యార్థులు వేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ ఈ వో విజేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రవి, హెల్త్ అసిస్టెంట్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

రామడుగు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వరి

రామడుగు, ఫిబ్రవరి 6 : క్షయ వ్యాధిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో రాజేశ్వరి సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో టీబీ ముక్త్ అభియాన్‌పై ఒక్కరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, గ్రామాలను టీబీ రహితంగా మార్చేందుకు అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు. ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో కరీంనగర్‌ను టీబీ రహిత జిల్లాగా నిలిపేందుకు జిల్లా క్షయ నివారణ విభాగం, జనరల్ హెల్త్ సిబ్బందితో కలిసి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రవణ్‌కుమార్, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ లీడ్ పురుషోత్తం, ట్రైనింగ్ మేనేజర్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంగాధర, ఫిబ్రవరి 6: టీబీ నివారణకు అందరి సహాయ సహకారాలు తీసుకోవాలని ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ స్టేట్ ఆఫీసర్ పురుషోత్తం సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో టీబీ ముక్త్ అభియాన్‌పై పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కరీంనగర్‌ను టీబీ రహిత జిల్లాగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది కొత్త కేసులను గుర్తించడంతో పాటు బాధితులు సక్రమంగా మందులు వాడేలా చూడాలని, గ్రామాల్లో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి ప్రభాకర్, ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్దన్‌రెడ్డి, శిక్షణ మేనేజర్ సురేందర్ పాల్గొన్నారు.

17 నుంచి పీజీ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 6 : శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో పీజీ పరీక్షలు ఈ నెల 17 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు 17 నుంచి 21 తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. అలాగే, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలను రెగ్యులర్, బ్యాక్‌లాగ్ అభ్యర్థుల కోసం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు, యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో లేదా, ఆయా కళాశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

అట్టహాసంగా ఎదుర్కోలోత్సవం

అమ్మవార్లకు తీసుకువచ్చిన సారెతో పద్మశాలీ సంఘం బాధ్యులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 6 : జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పద్మశాలీ కులస్తులు, వాసవీ సంఘం బాధ్యులు అమ్మవార్లకు ఘనంగా సారె సమర్పించారు. అంతకు ముందు వేంకటేశ్వర స్వామి కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయం నుంచి అశ్వవాహనంపై శ్రీవారు, గజవాహనంపై అమ్మవార్లు బయలుదేరి ప్రకాశంగంజ్‌లోని వరసిద్ధి వినాయక దేవాలయం చేరుకున్నారు. ఇందులో భాగంగా, నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం కనుల పండువగా, అట్టహాసంగా జరిగింది. శుక్రవారం శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి, లక్ష్మీనారాయణస్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె. సుధాకర్, ఆలయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల కల్చరల్ ఆర్గనైజర్ గోగుల ప్రసాద్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం గరుడవాహన సేవ నిర్వహించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ.. త్రుటిలో తప్పిన ప్రమాదం

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 6: పట్టణంలోని జమ్మికుంట రోడ్డులో ఓ ఆర్టీసీ మినీ బస్సు త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడింది. స్థానికుల కథనం ప్రకారం.. హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ మినీ బస్సు (టీఎస్ 23 0002) జమ్మికుంటకు వెళ్తుండగా, జమ్మికుంట ప్రధాన రహదారిలోని గెలాక్సీ సూపర్ మార్కెట్ సమీపంలో లారీ మినీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి వెనుక నుంచి ఢీకొన్నది. బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఆగింది. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉండగా, ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మినీ బస్సు ముందు భాగం ధ్వంసమైంది. బస్సు డ్రైవర్ రవీందర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, లారీ డ్రైవర్ ఎండీ జలీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని, విచారిస్తున్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్టు ప్రయాణికులు తెలిపారు.

'ఓసీల జనాభా శాతం మాత్రమే పెరిగేలా సర్వే'

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసిన తీరు సరైనది కాదని బీసీ ఆజాదీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కలు జరిపినప్పుడు క్రితం కంటే జనాభా శాతం పెరుగుతుందని గుర్తు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా శాతం తగ్గించి, కేవలం ఓసీల జనాభా శాతం మాత్రమే పెరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే నిర్వహించిందని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. 56 శాతం ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో దక్కాల్సిన వాటాను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఏడీఏ డిజిటల్ సర్వే పరిశీలన

శంకరపట్నం, ఫిబ్రవరి 6: ఆముదాలపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టిన పంటల సాగు నమోదు సర్వేను గురువారం మానకొండూర్ ఏడీఏ శ్రీధర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వేకు మండలంలో ఆముదాలపల్లి రెవెన్యూ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా ఏఈవోలు రైతులు వేసిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వే నంబర్ల వారీగా వివరాలను నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇక్కడ ఏవో వెంకటేశ్, ఏఈవో సునంద, రైతులు ఉన్నారు.

ఆముదాలపల్లిలో పంటల సర్వే తీరును పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీధర్

'మండలి'కి నామినేషన్ల జోరు

- నాలుగో రోజు 15 మంది దాఖలు

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : ఉత్తర తెలంగాణ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకు నామినేషన్ల జోరు పెరిగింది. మొదటి మూడు రోజు అంతంత మాత్రంగానే రాగా, నాలుగోరోజు గురువారం రెండు స్థానాలకు కలిపి 15 మంది దాఖలు చేశారు. వీరిలో గ్రాడ్యుయేట్ స్థానానికి 12, టీచర్ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు వేశారు. ఈ నెల 3న నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవగా, మొదటి మూడు రోజుల్లో కేవలం 13 మంది మాత్రమే వేశారు. గురువారం ఒక్క రోజే 15 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. శని, ఆదివారాలు ప్రభుత్వ సెలవులు కావడం, సోమవారం ఒక్కరోజే గడువు ఉండడంతో అత్యధిక మంది గురు, శుక్రవారాల్లోనే వేసేందుకు నిర్ణయించుకున్నట్లు వారి అనుచరగణం పేర్కొంటున్నది. ఈ క్రమంలో శుక్రవారం కూడా నామినేషన్ల జాతర కొనసాగనున్నట్లు స్పష్టమవుతున్నది.

రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 6: ఈ నెల 26న మహాశివరాత్రి జాతర పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు వేములవాడ, కాళేశ్వరం, వేలాల, దుబ్బరాజన్న, పొట్లపల్లి దేవాలయాలకు వెళ్లే భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బీ రాజు డీఎంలకు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గల సమావేశ మందిరంలో ఆర్టీసీ రీజియన్ పరిధిలోని 11 డిపోల డీఎంలతో ఆర్‌ఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. బస్టాండ్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. బస్టాండ్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడడంతోపాటు, బస్సుల వివరాలను మైక్ ద్వారా వివరించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమావేశంలో డీఆర్‌ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ మనోహర్, డీఎంలు మల్లయ్య, విజయమాధురితో ఇతర డిపోల డీఎంలు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 6: బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ కేంద్ర రాష్ట్రప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ, దేశ జన గణనలో భాగంగా కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశంలో బీసీ మహిళా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసి బీసీల అభివృద్ధి కోసం రెండు లక్షల కోట్లను కేటాయించాలన్నారు. కుల వృత్తి మీద ఆధారపడి జీవనోపాధి పొందుతున్న బీసీలకు సబ్సిడీ రుణాలను అందించాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సమ్మయ్య, రాజు, లక్ష్మణ్, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

రెడ్డి సమాజంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 6: బీసీ సభలో రెడ్డి సమాజంపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రజా మిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటివ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ ఖండించారు. నగరంలోని ఫ్రంట్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒక కులాన్ని లక్ష్యంగా చేసుకొని విమర్శలకు దిగడం తగదన్నారు. చేతిలో రూపాయిలేని తీన్మార్ మల్లన్నకు కోట్ల రూపాయలు ఎక్కడివని ప్రజలు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తితో బీసీ సమాజానికే చెడ్డ పేరు వస్తున్నదన్నారు. బీసీ నాయకత్వం తీన్మార్ మల్లన్నను కట్టడి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి అల్ఫోర్స్ విద్యార్థిని ఎంపిక

విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 6 : బెంగళూరులో జరిగే జాతీయ సమైక్యత శిబిరానికి శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని బైరి అక్షిత ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ వీ రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఆయన సత్కరించారు. జాతి ఐక్యతను చాటేలా నిర్వహించే ఈ కార్యక్రమంలో తమ కళాశాల విద్యార్థిని, భాగస్వామి కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, జాతీయ సేవాపథకం కార్యక్రమ అధికారి గోలి శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో ఉచిత ఆర్థోపెడిక్ కన్సల్టేషన్

విద్యానగర్, ఫిబ్రవరి 6: కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్‌లో ఈ నెల 28 వరకు ఉచిత ఆర్థోపెడిక్ కన్సల్టేషన్ నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హాస్పిటల్‌లో పెయిన్ ఫ్రీ చికిత్స ప్రారంభించిన సందర్భంగా ఉచిత కన్సల్టేషన్‌తో పాటు మోకాలు ఎక్స్ రే కూడా ఉచితంగా తీస్తున్నట్లు వెల్లడించారు. మోకాలు కీలు మార్పిడి చేసిన 24 గంటల్లోనే నడిపించడం, నొప్పి లేకపోవడం, రక్తం వృథాకాకపోవడం పెయిన్ ఫ్రీ చికిత్స ప్రత్యేకతలని తెలిపారు. ఈ చికిత్సలో అత్యంత అధునాతన ఇంప్లాంట్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. చికిత్స అనంతరం త్వరగా రికవరీ ఉంటుందని, ఐసీయూలో ఉండాల్సిన అవసరం లేదని, త్వరగా డిశ్చార్జి చేస్తామని స్పష్టం చేశారు. మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవయవదానంపై అవగాహన

వీణవంక, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవదానం ఆవశ్యకతను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవన్‌కుమార్, కార్యదర్శి డా.భీష్మాచారి, జిల్లా అధ్యక్షుడు ఎం.నరహరి విద్యార్థులకు వివరించారు. అంతకుముందు మండల కేంద్రానికి చెందిన అయిత సత్యనారాయణ నేత్రదానం చేసినందుకు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు ఆయన కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేసి, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్, జమ్మికుంట కన్వీనర్ గర్రెపెల్లి వెంకటేశ్వర్లు, వీణవంక డీలర్ శ్రీధర్, ఓదెల కార్యదర్శి క్యాతం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సైన్స్ టాలెంట్ టెస్ట్



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, ట్రస్ట్ నిర్వాహకుడు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 6: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని సైదాపూర్ బీసీ గురుకుల పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆఖ్యారపు రాణి, ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీ సమావేశం విజయవంతం చేయాలి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 6 : ఈ నెల 8, 9 తేదీల్లో జరుగనున్న భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి సంద గణేశ్ కోరారు. గురువారం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఉమామహేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుపై ఈ రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చిస్తున్నట్లు తెలిపారు. అలాగే, రాబోయే రోజుల్లో విద్యారంగం అభివృద్ధి కోసం చేపట్టాల్సిన ఉద్యమాలపై చర్చ ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అభి, నిపుల్, ఉమామహేశ్వర్, అభిలాష్, గణేశ్, నీలిమ, శ్వేత, అక్షయ, కావ్య తదితరులు పాల్గొన్నారు.